క్లుప్తంగా

మొక్కజొన్న సాగులో మెలకువలు తప్పనిసరి

వ్యవసాయ శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న పంటలను సాగుచేసే రైతులు పంటను ఆశించే చీడపీడల నివారణపై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శనివారం వారు దత్తత తీసుకున్న మండలంలోని గూడూరు గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పంటసాగులో అనుసరించాల్సిన విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేష్, ఉపేందర్, శైలజ, శకుంతల, స్థానిక సర్పంచ్ సత్తయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం



కాల్వ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్‌లో అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ యాదమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు. మురుగునీటిని వీధుల్లో వదలొద్దన్నారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మహబూబ్, వైస్ ఎంపీపీ ఆ్రాబేగం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు, నాయకులు సత్యనారాయణరెడ్డి, రజిత, లక్ష్మిసుధా, అమ్రమ్మ, వెంకట నర్సింహరెడ్డి, ఆంజనేయులు, గోబ్రానాయక్, నర్సింలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎంపీపీ

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన లావణ్యకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును శనివారం బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎంపీపీ రవీందర్ యాదవ్ చెక్కును అందజేశారు. లావణ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా, బాధితురాలిది నిరుపేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.18వేల మంజూరు చేయించినట్లు ఎంపీపీ రవీందర్ యాదవ్ తెలిపారు. ఈ చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నవీన్ కుమార్, అంజిరెడ్డి, పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డెబాసిస్ మిత్ర

మొయినాబాద్‌రూరల్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ డెబాసిస్ మిత్ర తెలిపారు. మండలంలోని ఎత్‌మార్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం రాత్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేస్తున్న రుణాలపై అవగాహన సదస్సును రైతులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణాల సద్వినియోగంలో రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్‌బీఐ అందిస్తున్న రుణాలతో దేశంలోని రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతున్నారని మరికొన్ని గ్రామాల్లోని రైతులకు తెలియక రుణాలను తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా ఎన్నో సబ్సిడీ రుణాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎత్‌మార్‌పల్లి గ్రామ సర్పంచ్ నవనీతా , ఎస్‌బీఐ జనరల్ చీఫ్ మేనేజర్ రాధాకృష్ణ, వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ బాలాజీ, మొయినాబాద్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నిఖిల్‌బాబు, చేవెళ్ల బ్యాంక్ మేనేజర్ శైలా, మొయినాబాద్ ఫీల్డ్ ఆఫీసర్ రఘు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పైసల్లేవ్!

- ఏడు నెలలుగా విడుదల కాని కేంద్రం నిధులు
- ఆరు నెలలుగా అందని రాష్ట్ర నిధులు
- భారంగా మారిన సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐల చెల్లింపు
- పంచాయతీల నిర్వహణకూ అప్పులే శరణ్యం



షాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: సర్కార్ సాయం అందక గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు నెలల తరబడి ఆగిపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ట్రాక్టర్ల ఈఎంఐలు, మల్టీపర్పస్‌ల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మల్టీపర్పస్ వర్కర్లకు పూట గడవడం కూడా కష్టంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీలు ప్రత్యేక ఖాతాలు ప్రారంభించారు. కానీ, నేటికి నిధులు జమ కాలేదు. ఇక రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఆరు నెలల నుంచి నిధులు విడుదల కావడం లేదు. 10 రోజుల క్రితం ఒక నెలకు సంబంధించిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినా ఇంకా ఐదు నెలల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.

పరిపాలన సాగేదెట్లా..?

గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నులతో పాటు ఇతరత్రా ఆదాయం అరకొరగా వస్తుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధుల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు నిలిచిపోవడంతో గ్రామ పంచాయతీల ఖజానా ఖాళీ అయింది. దీంతో ఆదాయ వనరులు ఉన్న పంచాయతీల్లో మినహా చాలా గ్రామ పంచాయతీలు గత రెండు, మూడు నెలలుగా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కార్మికుల వేతనాలు కూడా ఇవ్వని పరిస్థితి. వేతనాలకు సంబంధించిన చెక్కులు ట్రెజరీ కార్యాలయంలో అందించినప్పటికీ నిధులు లేకపోవడంతో విడుదల కావడం లేదు. విద్యుత్ దీపాల ఏర్పాటు, శానిటేషన్, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, తాగునీటి పైపులైన్ మరమ్మతుల వాటితో పాటు తదితర పనులు ఏమి చేపట్టలేకపోతున్నారు. దసరా, దీపావళి పండుగల సమయంలో ఒత్తిడి కారణంగా కొంత మంది సర్పంచ్‌లు తమ సొంత డబ్బులతో వివిధ పనులు చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో తలలు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్ల కిస్తీలు తలనొప్పిగా మారాయి. పంచాయతీల్లో వసూలయ్యే ఆస్తి పన్నులతోనే అన్ని పనులు చేయడం అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందికరంగా మారింది.

అన్ని పనులు చేయలేకపోతున్నాం



ప్రభుత్వాల నుంచి నిధులు రాక కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వడం లేదు. పారిశుద్ధ్య పనులు, పైపులైన్ లీకేజీ మరమ్మతులు ఇలా చిన్నచిన్న పనులకు కూడా ఇబ్బంది అవుతోంది. ఆస్తి పన్ను కూడా తక్కువగానే వసూలు అవుతుంది. వాటితో అన్ని పనులు చేయలేకపోతున్నాం.

– తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, సర్పంచ్, షాబాద్

నిధులు మంజూరు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాక అప్పుల పాలవుతున్నాం. ట్రాక్టర్ ఈఎంఐలు, డీజిల్ బిల్లులు, వర్కర్లకు వేతనాలు, సీసీ చార్జీలతో పాటు గ్రామ పంచాయతీ నిర్వహణ భారమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక నెల డబ్బులు వచ్చాయి. ఇంకా మూడు నెలల, కేంద్ర ప్రభుత్వం నుంచి ఏడు నెలలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

– చందిప్ప జంగయ్య సర్పంచ్, మల్లారెడ్డిగూడ, షాబాద్ మండలం

చేవెళ్ల ఏసీపీ రవీందర్‌రెడ్డి బదిలీ

కొత్త ఏసీపీగా ప్రభాకర్



ఏసీపీ రవీందర్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీ పైల్ల రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. చేవెళ్లకు కొత్త ఏసీపీగా సమిండ్ల ప్రభాకర్‌కి పోస్టింగ్ ఇచ్చారు. శనివారం డీఎస్పీల బదిలీల ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో చేవెళ్ల ఏసీపీ రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. 2019 అక్టోబర్ 26 నుంచి నేటి వరకు దాదాపు మూడేళ్లకు పైగా చేవెళ్ల ఏసీపీగా పనిచేశారు. రవీందర్‌రెడ్డికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. చీఫ్ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. అయితే చేవెళ్లకు కొత్త ఏసీపీగా సంగారెడ్డిలోని డీటీసీ డీఎస్పీగా ఉన్న సమిండ్ల ప్రభాకర్‌కు చేవెళ్ల ఏసీపీగా పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక నిధులను కేటాయిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో శనివారం సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వాలు నిధులు ఇవ్వలేదన్నారు. దీంతో, గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగలేదని ఆయన చెప్పారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొనాయపల్లి గ్రామ సర్పంచ్ మల్లేష్, ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్‌రావు, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

షాద్‌నగర్: లయన్స్ క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్, యువసత్తా యూత్ ఆధ్వర్యంలో లక్ష్మిగ్రీన్ మర్చంట్ సౌజన్యంతో పట్టణంలోని గంజ్ ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్స్ రీజియన్ చైర్మన్ ఎంవీఎస్ రంగయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దానం చేసే ప్రతి రక్తపు చుక్క ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తాన్ని ఎవరు తయారు చేయలేరని, శరీరంలో మాత్రమే రక్తం తయారు అవుతుందని చెప్పారు. క్రి.శే రతన్‌లాల్ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌వర్మ, రాజు, మల్లేష్, నవీన్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీపీ రవీందర్ యాదవ్



ప్రత్యేక పూజలు చేస్తున్న రవీందర్‌యాదవ్, తదితరులు

నందిగామ: ప్రతి ఒక్కరు దైవచింతన అలర్చుకోవాలని కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నా రు. మండల పరిధిలోని చేగూరులో కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి కేశంపేట ఎంపీపీ రవీందర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్మి స్తున్న దేవాలయాల్లో నిత్యం దూపదీపా నైవేద్యాలు అందే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాల ని సూచించారు. కేవలం పర్వదినాలు, వార్షికోత్సవాలలో మాత్రమే కాకుండా నిత్య పూజలు చేయా లని అన్నారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన కార్యక్రమాల్లో పూజలు సైతం చేయడం మర్చిపోవద్ద న్నా రు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఎంపీపీ మ ధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, సర్పంచులు అశోక్, కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండల బీఆర్‌ఎస్ పార్టీ 'ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం మున్సిపల్ పరిధిలోని మణి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే బరిలో ఎవరిని నిలిపిన వారి గెలుపుకోసం ప్రతి కార్యకర్త పని చేయాలని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేయాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి యువతి యువతీలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. అలాగే, రైతుబంధు, రైతు బీమా పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ , జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు పాడువ్ శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ చైర్మన్ రాజు నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొద్దాం

కాంగ్రెస్ సీనియర్ నేత శంకర్



కొందుర్గులో మాట్లాడుతున్న శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దామని ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందన్నారు. రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వడం లేదన్నారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాలుపడుతున్న బీఆర్‌ఎస్, బీజేపీలను గద్దెదించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు బాల్‌రాజ్ గౌడ్, బాబర్‌ఖాన్, రఘు, మహేందర్, నరేందర్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, చంద్రశేఖర్, వజ్రమ్మ, రజిత, గోవర్ధన్ గౌడ్, రవి, శ్రీనివాసు రెడ్డి,పైల్మాన్, అమీద్, మల్లయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీపీ

నందిగామ: మండల పరిధిలోని వెంకమ్మగూడలో నిర్మిస్తున్న మైసమ్మ, పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శనివారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ దేవతల దేవాలయాలు అనాదిగా ఉన్నాయని, ప్రస్తుతం కొన్ని గ్రామాల్లోని ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా నిర్మిస్తున్నారని అన్నారు. వెంకమ్మగూడ గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయాలకు తన వంతుగా రూ.51 వేల నగదును అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, లింగంనాయక్, దర్శన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



హరినాయక్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: కారు అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి బైపాస్ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కొందుర్గు మండలం అయోధ్యపూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని రామన్నగూడ తండాకు చెందిన హరినాయక్(32) భార్యాపిల్లలతో షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం రాత్రి హరినాయక్ కారులో కమ్మదనం బైపాస్ నుంచి హైదరాబాద్ వైపు బయలుదేరాడు. కారు రాంనగర్‌కాలనీ బస్టాండ్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ హైదరాబాద్, మహబూబ్‌నగర్ రోడ్డుపైకి దూసుకుపోయింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న డీసీఎంను ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన హరినాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. తిమ్మాపూర్ సమీపంలోని ఆనంద్ స్టీ ల్ పరిశ్రమ వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో వ్యక్తి ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. మృతదేహంపై నుంచి వాహనాలు వెళ్లడంతో ముఖం గుర్తు పట్టలేకుండా మారింది. సమీపంలోని సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులకు మృతుడు నడుకుంటూ వెళ్లిన చిత్రాలు లభించాయి. మృతుడి శరీరంపై క్రీం రంగు ప్యాంటు, నీలం రంగు షర్టు, నెత్తికి మంకీ క్యాప్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తించినా, వివరాలు లభించినా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శంకర్ కోరారు.

పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలి

పశువైద్యురాలు స్ఫూర్తి



జీవాలకు నట్టల మందును వేస్తున్న సర్పంచ్

కొత్తూరు: పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యురాలు స్ఫూర్తి సూచించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ, ఆవులు, గేదెలకు గర్భకోశ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు అనారోగ్యాలకు గురైతే ఆలస్యం చేయకుండా రైతులు చికిత్సలు చేయించాలని చెప్పారు. ముఖ్యంగా పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్, సిబ్బంది కృష్ణ, మల్లయ్య, రవి, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం



భాగ్యవతి(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: మరికొన్ని రోజుల్లో ఆ ఇంట్లో పెళ్లి సందడి మొదలు కానుంది. పెళ్లి బాజాలు మోగనున్నాయి. అంతలోనే వారింట తీవ్ర విషాదం నెలకొంది.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. ఎలికట్ట గ్రామానికి చెందిన దాసపతి ఆంజనేయులు, భాగ్యవతి(48) దంపతులు వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఆంజనేయులు హైదరాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా భార్య ఇంటి వద్దనే ఉంటుంది. శనివారం ఉదయం ఆంజనేయులు విధులకు వెళ్లేందుకు హైదరాబాద్‌కు బయలుదేరాడు. భర్త వెళ్లిన కొద్ది సేపటికి భాగ్యవతి హఠాత్తుగా గుండెపోటుకు గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మరికొన్ని రోజుల్లో కుమార్తె పెళ్లి జరగాల్సిన ఆ ఇంట్లో తల్లి మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- సప్తవాహన సేవల ఊరేగింపు
- వేడుకల్లో పాల్గొన్న సంగీత దర్శకుడు మణిశర్మ



సూర్యప్రభవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా స్వామివారికి సప్తవాహన సేవలు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారిని సప్త వాహన సేవలైన సూర్యప్రభవాహనం, హంసవాహనసేవ, సింహ్మవాహనసేవ, శేషవాహనసేవ, గజవాహన సేవ, హనుమంతవాహన సేవ, గరుడవాహన సేవలపై స్వామివారిని ఊరేగించారు.

రథసప్తమి పూజల్లో పాల్గొన్న మణిశర్మ

లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన రథసప్తమి వేడుకల్లో ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పూజారులు, ఎండోమెంట్ అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: మండలంలోని అన్ని గ్రామాలను ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఊరేళ్ల గ్రామంలో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, సర్పంచ్ జహంగీర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఊరేళ్ల గ్రామంలోని ప్రధాన రోడ్డుగా ఉన్న అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమాన్ దేవాలయం వరకు ఈ సీసీ రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. ఈ రోడ్డుతో గ్రామంలో ప్రధాన సమస్య తీరుతుందన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, అభివృద్ధి చేయడంతో పాటు గ్రామానికి ఒక స్మశాన వాటికి డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, తదితర వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివప్రసాద్, సర్పంచ్ జహంగీర్, ఉప సర్పంచ్ విఠలయ్య, గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.